క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య శిబిరం



శ్రీనివాసపురం సొసైటీలో నేత్ర పరీక్షలు నిర్వహించిన వైద్యులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సొసైటీ చైర్మన్ పోల్నాటి బుచ్చిరాజు ప్రారంభించారు. నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల వైద్యులు శిబిరానికి వచ్చిన ప్రజలకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. మొత్తం 110 మందికి పరీక్షలు నిర్వహించగా వీరిలో 25 మందికి ఆపరేషన్ చేయాల్సిందిగా, 15 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఆపరేషన్ అవసరమైన వారిని ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించేందుకు నిడదవోలు తరలించినట్టు సొసైటీ చైర్మన్ బుచ్చిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఎలికే సర్వేశ్వరరావు, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలిక కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం



రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేస్తున్న దాతలు

కామవరపుకోట: ఇటీవల అస్వస్థతకు గురై ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన మండలంలోని కళ్లచెరువు గ్రామానికి చెందిన మెతుకుమెల్లి వేగోలు కుమార్తె రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులకు తడికలపూడి సచివాలయ కన్వీనర్ వెర్రి శ్రీను రూ.40 వేలు, తడికలపూడి గంగేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు రూ.60 వేలు, తడికలపూడి తాపీ మేస్త్రి సంఘ సభ్యులు రూ.50 వేలు మొత్తంగా రూ.1.50 లక్షలు, 150 కేజీల బియ్యం అందజేశారు. రాజ్యలక్ష్మి కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని సచివాలయ కన్వీనర్ వేర్రు శ్రీను తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కురాకుల సత్యనారాయణ, తాపీ మేస్త్రి సంఘ సభ్యులు శివయ్య, గంగయ్య పాల్గొన్నారు.

ఆదివాసీల వలసపై వివరాల సేకరణ

పోలవరం రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ కూలీలు వలసకు వెళ్లిన వారి వివరాలను కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో సేకరించే పనులు చేపట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం పోలవరం గ్రామ సచివాలయం వద్ద సచివాలయ సిబ్బంది వలంటీర్లతో మండలంలో వలస వెళ్లిన ఆదివాసీ కూలీల వివరాలు రీసెర్చ్ ఇన్వెస్టిగేషన్ బృందం సభ్యులు ఎం.శివాజీ, ఎస్.రమేష్ సేకరించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో 20 రోజులుగా వలస కూలీల వివరాలను సేకరిస్తున్నామన్నారు. సుమారు 100 కుటుంబాలు వలసకు పనులు నిమిత్తం వెళ్లినట్లు గుర్తించామన్నారు. ఆదివాసీల జీవన స్థితిగతులు మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు పాల్గొన్నారు.

26 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు స్థానిక దామోదర సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయని ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ పరీక్షలు మొదటి సెషన్ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు నిబంధనలు ప్రకారం నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు తమ కళాశాల నుంచి 90 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

సులభ్ కాంప్లెక్స్ మంజూరు



చింతలపూడిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, కమిషనర్

చింతలపూడి: పట్టణంలో సులభ్ కాంప్లెక్స్ మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని నూజివీడు సబ్ కలెక్టర్, నగర పంచాయతీ ప్రత్యేక అధికారి ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. శుక్రవారం చింతలపూడిలో ఆయన పర్యటించారు. మినీ బస్టాండ్ సమీపంలోనే మంగబావి వద్ద సులభ్ కాంప్లెక్స్‌కు స్థలం కేటాయించినట్లు చెప్పారు. కమిషనర్ ఎస్.రాంబాబుతో కలిసి పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. వేగిలింగేశ్వరస్వామి చెరువు గట్టును శుభ్రం చేసి వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు



మదన గోపాల స్వామి ఆలయంలో ప్రతిష్ఠకు సిద్ధమైన ధ్వజ స్తంభం



నూకాలమ్మవారికి పూజలు నిర్వహించిన భక్తులు

కొయ్యలగూడెం: రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయ నిర్మాణం కొయ్యలగూడెం గ్రామస్తులకే కాక ఏజెన్సీ మెట్ట ప్రాంత వాసులకు గర్వ కారణంగా నిలవబోతోందని కాన్వ విద్యాపీఠాధిపతి బ్రహ్మశ్రీ అనిపెద్ది నరసింహ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆశ్రమంలో నిర్వహించిన సమావేశంలో శిష్య పరివారంతో ఆయన ప్రసంగించారు. సుమారు 235 ఏళ్ల నాటి మదన గోపాల స్వామి ఆలయాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని దేవదాయ ధర్మాదాయ శాఖ, టీటీడీ నిధులు దాదాపు రూ.కోటి పైగా వెచ్చించి పునర్నిర్మించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో 27వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు మదన గోపాల స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ, నూతనంగా ప్రతిష్ఠించే లక్ష్మీనరసింహ స్వామి, వేంకటేశ్వర స్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామస్తులు పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. మార్చి 1వ తేదీ గ్రామానికి చెందిన తోబుట్టువులను సోదరులు పుట్టింటికి ఆహ్వానించి పసుపు, కుంకుమలు నూతన వస్త్రాలు సమర్పించాలన్నారు. ఉత్సవాల ప్రారంభం మొదలుకొని మార్చి 1వరకు మొక్కులకు సంబంధించిన జంతు బలులు చేయకూడదన్నారు. అన్నప్రసాదాలు పంపిణీ చేయవచ్చని, గ్రామంలోని అన్ని హిందూ ధార్మిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని సూచించారు. తల్లిదండ్రుల పేరిట వంశీయులు వస్త్రాలు సమర్పించాలన్నారు. యాగశాలను దర్శించి మండపారాధనలో పాల్గొనాలని, ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠ సమయంలో ప్రత్యక్షంగా పాల్గొనడం శుభదాయకమని అన్నారు.

ప్రతిష్ఠకు సిద్ధమైన ధ్వజ స్తంభం

రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయ ప్రారంభోత్సవ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే ధ్వజ స్తంభం సిద్ధమైంది. 27నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, మార్చి 1వ తేదీ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపి తెలిపారు. పోలవరం మండలం పాపికొండల సమీపంలో ధ్వజ స్తంభానికి పేరుగాంచిన సోము చెట్టును అటవీ నిబంధనల ప్రకారం తీసుకువచ్చి 49 అడుగుల ఎత్తులో తయారు చేసామన్నారు. స్తంభానికి రక్షణగా సుమారు 300 కేజీల ఇత్తడిని భక్తులు విరాళంగా అందజేశారని దానిని కరిగించి రేకులుగా తయారు చేసి ధ్వజ స్తంభానికి తాపడం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, అభివృద్ధి కమిటీ సభ్యులు ధ్వజస్తంభ నిర్మాణాన్ని పరిశీలించారు.

ధ్వజ స్తంభం ఏర్పాటు చేయాలి

జంగారెడ్డిగూడెం: బుట్టాయగూడెం రోడ్డులోని రామాలయానికి ధ్వజ స్తంభం ఏర్పాటు చేయాలని బీజేపీ ఏలూరు జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ కొప్పాక శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలో పట్టణ ధార్మిక సెల్ అధ్యక్షుడు తుమ్మలపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుట్టాయిగూడెం రోడ్డులోని పురాతన రామాలయంలో ఎటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించక వెలవెలబోతోందని, ముఖ్యంగా ఆలయానికి ధ్వజ స్తంభం పునర్నిర్మించే ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. దీనిపై ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారిని సంప్రదించగా, ఆ ఆలయ పుర నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, సుమారు రూ.60 లక్షల నిధి మంజూరైందని, రామాలయం ఆలయం ఖాతాలో రూ.33 లక్షలు ఉండాలని అప్పుడే మ్యాచింగ్ గ్రాంట్ వస్తుందని, తద్వారా అనుమతి తీసుకువచ్చి ఆలయ పునర్నిర్మాణంతో పాటు ధ్వజ స్తంభం పునర్నిస్తామని తెలిపారు. ధర్మకర్తల మండలిని నియమించి, ఆలయాభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు ధార్మిక సెల్ కన్వీనర్ సాయి సింగ్ పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయానికి రూ.10,116 విరాళం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మవారికి శుక్రవారం ఆలయ అర్చకుడు మనోజ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ శుక్రవారం కొత్త అమావాస్య, ఉగాది ఉత్సవాల 59వ వార్షిక జాతర మహోత్సవాల నిర్వహణకు సంబంధించి శాస్త్రోక్తంగా పాల కర్ర రాట పూజ చేసి అంకురార్పణ చేసినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి మైరెడ్డి జగదీష్, లలితాభవాని దంపతులు రూ.10,116 విరాళం అందజేశారన్నారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు. అమ్మ వారి శేష వస్త్రాన్ని, చిత్ర పటాన్ని వారికి అందించి వేద ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలుపర్తి రాము దంపతులు, రొంగల నాగేశ్వరావు దంపతులు, చొప్పెర్ల లక్ష్మీనారాయణ దంపతులు, చిట్లూరి సర్వేశ్వరరావు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి సీఎం జగన్ కృషి



వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కొవ్వాసి నారాయణను సన్మానిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎనలేని కృషి చేస్తున్నారని జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు కొవ్వాసి నారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు అన్నారు. ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్టీసెల్ అధ్యక్షుడిగా కొవ్వాసి నారాయణ ఎంపికైన సందర్భంగా ఆయనను శుక్రవారం జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండలంలోని కేఆర్‌పురంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ పాలనలో చంద్రబాబునాయుడు గిరిజనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. పాదయాత్రలో గిరిజనుల కష్టాలను స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేశారని అన్నారు. వివిధ పదవుల్లో గిరిజనులకు అవకాశం కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉయికే బొజ్జి, నాయకులు కె. ప్రసాద్, నాగేశ్వరరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగు మందు అవశేషాల్లేకుండా పొగాకు ఉత్పత్తి



కొయ్యలగూడెంలో పొగాకును పరిశీలిస్తున్న గ్రేస్ మార్గరెట్

కొయ్యలగూడెం: పురుగు మందు అవశేషాల్లేకుండా వర్జినియా పొగాకు పంటను ఉత్పత్తి చేసుకొని రైతులు లబ్ధి పొందాలని కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం నిర్వహణ అధికారి గ్రేస్ మార్గరెట్ పేర్కొన్నారు. పురుగు మందుల అవశేషాలపై రైతులకు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఆమె బోర్డు అధికారులతో కలిసి కొయ్యలగూడెం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వర్జినియా పొగాకు బేరన్ ద్వారా దిగుమతి అయిన పొగాకును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పురుగు మందుల అవశేషాల్లేకుండా రైతులు పండిస్తుండడం వల్ల గత రెండేళ్ల నుంచి అంతర్జాతీయ మార్కెట్లో ఎన్ఎల్ఎస్ పొగాకు గిట్టుబాటు ధర లభిస్తోందన్నారు. బోర్డు సూచన మేరకు రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 23 నుంచి మెట్ట ప్రాంతంలోని ఐదు వేలం కేంద్రాల్లో వర్జీనియా పొగాకు కొనుగోలు ప్రారంభమవుతాయన్నారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం ద్వారా రైతులకు 10.5 మిలియన్ల కేజీల పొగాకు పంటకి అనుమతి ఇచ్చామని ఆమె తెలిపారు.

ఘనంగా చైతన్య కళావేదిక విశిష్ట పురస్కారాల ప్రదానం



జొన్నకూటి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: కళపట్ల తమకున్న ఆరాధన ఆచరణలో చూపడం ద్వారా జంగారెడ్డిగూడెం చైతన్య కళావేదిక వ్యవస్థాపకుడు జొన్నకూటి వెంకటేశ్వరరావు కళారంగంలో ప్రత్యేకస్థానం పొందారని ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి గురునాథరావు అన్నారు. జంగారెడ్డిగూడెం చైతన్య కళావేదిక ఆధ్వర్యంలో ప్రఖ్యాత నాటక కళాకారులు దివంగత చీమకుర్తి నాగేశ్వరరావు, దివంగత బండారు రవికుమార్ 17వ వర్ధంతి సభ, విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవం స్థానిక ఎంటీ సోషల్ క్లబ్‌లో నిర్వహించారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పంతగాని వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దివంగత చీమకుర్తి నాగేశ్వరరావు స్మారక పురస్కారాన్ని చందమామ ఆర్ట్స్ వ్యవస్థాపకులు ఎండీ మౌలాకు, బండారు రవికుమార్ స్మారక పురస్కారాన్ని రోటరీ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ గణిత ఆనంద ప్రసాద్‌కు, మాతంగి విజయరాజు స్మారక పురస్కారాన్ని ప్రతిభా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కాసర లక్ష్మి సరోజారెడ్డికి, గుమ్మడి జయరాజు స్మారక పురస్కారాన్ని వాసవీ క్లబ్ జిల్లా ఇన్‌చార్జ్ జవ్వాజి ఉమా వెంకటేష్‌కు, అరిగెల జేమ్స్ స్మారక పురస్కారాన్ని లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఉక్కుర్తి సీతారాంకు, కనుపర్తి లక్ష్మీవీర్రాజు స్మారక పురస్కారాన్ని హైదరాబాద్‌కు చెందిన హైకోర్ట్ సీనియర్ న్యాయవాది కనుపర్తి వెంకట సింహాద్రి ప్రతినిధులు తిరుమలాపురం సర్పంచ్ కనుపర్తి శ్రీనివాస్‌తో కూడిన బృందానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త తిప్పాబొట్ల వెంకట రామకృష్ణ, సామాజికవేత్త కేఎల్ఎన్ ధనకుమార్, మల్లాది సీతారామారావు(ఎంఎస్ఆర్), కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాసర నర్సిరెడ్డి, చిన్ని రామ సత్యనారాయణ(సీ హెచ్ ఆర్), చిలుకూరు సుబ్బయ్యాచారి, ఎల్ఆర్ కృష్ణబాబు, రోటరీ అధ్యక్షుడు దాకారపు కృష్ణ, మందపల్లి లక్ష్మయ్య, ఎండీ ఉమర్ ఆలీ, చిట్రోజు తాతాజీ, వలవల తాతాజీ, కనుపర్తి వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జొన్నకూటి వెంకటేశ్వరరావుకు ప్రోత్సాహక సత్కారం చేశారు.

గిరిజన గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

బుట్టాయగూడెం: వేసవిలో గిరిజన గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. గతంతో పోల్చుకుంటే ఫిబ్రవరిలోనే ఎండలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు ఎటువంటి మంచినీటి కష్టాలు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. నిర్మాణంలో ఉన్న మంచినీటి వాటర్ ట్యాంక్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సత్యసాయి మంచినీటి పథకాన్ని సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా కృషి చెయ్యాలని కోరారు.

ఈనాడు విద్వేషపూరిత రాతలను ఖండిస్తున్నాం

ఈనాడు విద్వేషపూరిత రాతలను తీవ్రంగా ఖండిస్తున్నానని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తప్పుడు రాతలతో ఈనాడు పత్రిక, దాని యాజమాన్యం రామోజీరావు ప్రజల్లో విశ్వసనీయత ఎప్పుడో కోల్పోయారని విమర్శించారు. అబద్ధపు కల్పిత రాతలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ చంద్రబాబును అధికార పీఠంపై కూర్చోబెట్టడానికి ఈనాడు పత్రిక టీడీపీ కరపత్రంలా పనిచేస్తోందని అన్నారు. నాడు ఎన్టీఆర్‌ను కూడా ఇదే విధంగా తప్పుడు రాతలు రాసి గద్దె దించి చంద్రబాబుకు పట్టం కట్టారని అన్నారు. ఈనాడు యాజమాన్యం తప్పుడు రాతలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రజారంజక పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మాత్రం ఆయన పక్షానే ఉన్నారని చెప్పారు.

గిరిజన గ్రామంలో వైద్య శిబిరం



గుట్టతోగులో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కుక్కునూరు: వాతావరణ మార్పులతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్య బృందం వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తున్నారు. అమరవరం పీహెచ్‌సీ పరిధిలోని గుట్టతోగు గిరిజన గ్రామానికి 104 వాహనం వెళ్లడానికి దారిలేకపోవడంతో శుక్రవారం అమరవరం పీహెచ్‌సీ వైద్యుడు డా. సముద్రాల అనంత్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది బైక్‌ల మీద వెళ్లి ఆదివాసీ గిరిజనులను వైద్య సేవలందించారు. గ్రామంలోని మొత్తం 42 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఇద్దరు జ్వరంతో బాధపడుతుండడంతో వారికి మందులు అందజేశారు. గ్రామంలోని మహిళలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు సిబ్బంది తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బుట్టాయగూడెం: ముప్పినవారిగూడెం సమీపంలో శుక్రవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం. జయబాబు తెలిపారు. ఈ దాడుల్లో రూ. 3,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడి నియామకంపై హర్షం



వాసిరెడ్డి మధుసూధనరావు (మధు)

టి.నరసాపురం: మండలంలోని కె.జగ్గవరం సహకార సంఘ చైర్మన్ వాసిరెడ్డి మధుసూధనరావు (మధు)ను వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా పార్టీ నియమించింది. ఈయన ప్రజా సంకల్ప పాదయాత్ర సమయంలో రైతు సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా సమస్యలను వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిష్కరించేందుకు కృషి చేశారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన మధుకు రైతు విభాగం అధ్యక్షుడిగా పార్టీ నియమించడంపై పార్టీ శ్రేణుల్లో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ సందర్భంగా మధు శుక్రవారం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లాస్థాయి పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో–ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానికి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం వృద్ధి



గూటాలలో అవగాహన ర్యాలీ

పోలవరం రూరల్: ప్రకృతిలో దొరికే వనరులతో కషాయాలు తయారు చేసి పంటలకు వాడటం వల్ల తెగుళ్ల నివారణతోపాటు భూమి సారవంతమవుతుందని వ్యవసాయ శాఖ మండల యాంకర్ వి.జోతిర్మయి అన్నారు. పోలవరం మండలం గూటాల గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవధాన్యాలు సాగు, నేలతల్లికి బాగు, నవధాన్యాలు సాగుచేద్దాం, పుడమి తల్లిని కాపాడుకుందాం అంటూ నినదించారు. రసాయనిక ఎరువులు వద్దు, నవధాన్యాలు ముద్దు, నవధాన్యాలు సాగుచేయండి, భూసారాన్ని పెంచుకోండి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు సుంకర అంజిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి అమానుషం



ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

జంగారెడ్డిగూడెం: న్యాయవాదిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ కోరింది. శుక్రవారం విధులను బహిష్కరించి, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి, కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ తెలంగాణకు చెందిన న్యాయవాది నారపాక సురేంద్రపై నల్గొండ జిల్లాలో ఆయన వాదిస్తున్న కేసులోని ప్రతివాదులు అత్యంత పాశవికంగా దాడి చేసి గాయపర్చడం బాధాకరం అన్నారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. బార్ అసోసియేషన్ నాయకులు బలుసు శ్రీనివాస్, భాషా శ్యాంబాబు, జీవీవీ శేఖర్, జీఎస్ఆర్ మూర్తి, పాములపాటి కృష్ణారెడ్డి, అచ్యుత శ్రీనివాస్, మానికల సూరిబాబు, జె.ఉమామహేశ్వరరావు, ఎం.క్రాంతికుమార్, సీహెచ్ నేతాజీ, వింజమూరి కిరణ్‌కుమార్, వి.విష్ణుమూర్తి, పి.పెద్దిరాజు, జి.మణికుమార్, సొలస ధర్మరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం సీఐ బాల సురేష్‌బాబు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ సిబ్బందితో కలిసి ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించామన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించని వారిపై ముందు జరిమానా విధించకుండా వారిలో పరివర్తనను తీసుకువచ్చేందుకు అవగాహనక కల్పిస్తున్నామన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయాల్లో వారి ప్రాణాలకు అపాయం కలగకుండా ఉంటుందని తెలిపారు. హెల్మెట్ లేని వారిని గుర్తించి వారితో కొనుగోలు చేయించినట్లు ట్రాఫిక్ ఎస్సై తెలిపారు.

అదానీ కుంభకోణంపై సమగ్ర విచారణ చేయాలి



జంగారెడ్డిగూడెంలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం: అదానీ కుంభకోణంపై సమగ్ర విచారణ చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. జంగారెడ్డిగూడెం సీపీఎం కార్యాలయం ఎదురుగా శుక్రవారం ఆపార్టీ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రామకృష్ణ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి ఏ.రవి మాట్లాడారు. భారతదేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడా పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు దాసోహమై దేశ సంపదను దోచి పెడుతున్నారన్నారు. ఆదాని భారత దేశంలోని అత్యంత సంపన్నుడిగా ఎదిగిన వైనం దీనిక నిదర్శనం అన్నారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ చట్టానికి, వ్యవసాయ రంగానికి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఊసే లేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు టి.దుర్గారావు, ఎం.జీవరత్నం, ఎస్కే సుభాషిని, జి.సూర్యకిరణ్ పాల్గొన్నారు.

భూముల్లో సర్వే రాళ్లు వేసిన రెవెన్యూ సిబ్బంది



శ్రీనివాసపురంలో సర్వే రాళ్లు వేస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: భూవివాదాలు, తగాదాలు లేని గ్రామాలు సాక్షాత్కారం కావడమే ప్రభుత్వం అమలు చేస్తున్న భూసర్వే లక్ష్యమని సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు అన్నారు. శ్రీనివాసపురంలో భూసర్వే పూర్తి చేసిన పొలాల్లో రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్వే రాళ్లు వేశారు. సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు పాల్గొన్నారు.